క్లుప్తంగా

10న కవితా స్రవంతి ఆవిష్కరణ


గరిమెళ్ల కవితా స్రవంతి

శ్రీకాకుళం కల్చరల్: ఈనెల 10వ తేదీన గరిమెళ్ల కవితల సంకలనాన్ని ప్రియాగ్రహారంలో ఆవిష్కరించనున్నట్లు అరసం జిల్లా కార్యదర్శి చింతల కృష్ణారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రగతి సాహితీ సంస్థ వ్యవస్థాపకుడు ఇలపండ గణపతిరావు అధ్యక్షతన జూనియర్ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ ఎస్ఎస్ నాగకుమారి చేతులమీదుగా ఆవిష్కరణ జరుగుతుందని తెలిపారు. ఇదే కార్యక్రమంలో నల్లి ధర్మారావు రచించిన 'మాకొద్దీ తెల్లదొరతనం' నాటిక పరిచయ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అభిమానులంతా హాజరవ్వాలని కోరారు.

సామాజిక దృక్పథం అలవర్చుకోవాలి


యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లుగా చేరుతున్న విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: విద్యార్థులు సామాజిక దృక్పథాన్ని అలవర్చుకోవాలని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. స్థానిక కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల (ఉమెన్స్)లో జిల్లా జాయింట్ కలెక్టర్ సూచనల మేరకు యూత్ రెడ్‌క్రాస్ విభాగాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్‌క్రాస్‌లో వలంటీర్‌గా చేరి మరిన్ని సేవలు అందించాలని కోరారు. యూత్ రెడ్‌క్రాస్ ద్వారా చేయాల్సిన కార్యక్రమాలు, ఆవశ్యకత కోసం ప్రోగ్రాం మేనేజర్ జి.రమణ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.శివశంకర్, వైస్ ప్రిన్సిపాల్ వేణు, యూత్ రెడ్‌క్రాస్ కాలేజీ కన్వీనర్ మోహనరావు, రెడ్‌క్రాస్ పీఆర్వో చైతన్యకుమార్, ఉమాశంకర్, పవన్, కాకినాడ ఆదిత్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ ఎన్నికలు జరిపించాలి


ప్రెస్‌క్లబ్ వద్ద నిరసన తెలియజేస్తున్న జర్నలిస్టులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జర్నలిస్టుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ప్రెస్‌క్లబ్ ఎన్నికలు జరిపించాలని నగరంలో జర్నలిస్టులు కోరారు. ఈ మేరకు ఏడురోడ్ల కూడలిలో ఉన్న ప్రెస్‌క్లబ్ వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులంతా ప్రెస్‌క్లబ్‌ను సక్రమంగా వాడుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రెస్‌క్లబ్ ఆదాయాన్ని వాడాలన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు దోల శంకరరావు, చింతపల్లి నాగభూషణరావు, చింతాడ అప్పలనాయుడు, నూరు చంద్రశేఖర్, దోల అప్పన్న, తిత్తి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

14, 15 తేదీల్లో మహాసభలు


కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం: మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల మహాసభలు ఈనెల 14, 15వ తేదీల్లో అనంతపురంలోని అంబేడ్కర్ భవనంలో జరుగుతాయని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.వి.జగన్నాథరావు, ఉత్తరాంధ్ర జర్నలిస్టుల సమాఖ్య అధ్యక్షుడు చౌదరి లక్ష్మణరావు తెలియజేశారు. సోమవారం శ్రీకాకుళంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14వ తేదీన సంస్థాగత కార్యక్రమం, 15వ తేదీన సమకాలిన అంశాలపై కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం మహాసభల కరపత్రాలను విడుదల చేశారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరామమూర్తి

జి.సిగడాం: గ్రామాల్లో నిర్వహించనున్న సాగునీటి ఎన్నికలకు దవళపేట పంచాయతీ పరిధిలో ఉన్న రైతులంతా సిద్ధంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ ఉపాధ్యక్షుడు పేడాడ శ్రీరామమూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని దవళపేట గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, రైతులు కలిసికట్టుగా పని చేయాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలల గడిచినా, ఇంత వరకు హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం మోసం చేస్తోందని దుయ్యబట్టారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడానికి సిద్ధం కావాలన్నారు. సమావేశంలో సర్పంచ్ వడిశ మహేశ్వరరావు, నాయకులు పేడాడ శ్యామలరావు, కంచరాన రమణరావు, పేడాడ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

జ్వర భద్రం..!

- గ్రామాల్లో ఉద్ధృతంగా దోమల వ్యాప్తి
- రోగాలబారిన పడుతున్న ప్రజలు
- నిరుపయోగంగా ఫాగింగ్ మెషిన్లు


పొన్నాడ పంచాయతీ బింగుపేటలో నిల్వవున్న మురికి నీరు

ఎచ్చెర్ల: వాతావరణంలో మార్పులు, ఇటీవల అకాల వర్షాలు కురవడం, తదితర కారణాల వలన గ్రామాల్లో దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. సాయంత్రం నాలుగు గంటలు దాటితే చాలు ప్రజలపై వాటి ప్రతాపాన్ని చూపిస్తున్నాయి. అక్కడ, ఇక్కడ అనే తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ అన్ని ప్రాంతాల్లో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. సాధారణంగా వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండి, భూమి తడిబారి ఎక్కువ రోజులు తేమ కారణంగా ఎక్కడికక్కడ దోమలు వృద్ధి చెందేవి. మిగిలిన రోజుల్లో కాలువలు, డ్రైనేజీల్లో మురుగునీరు పారిన ప్రాంతాల్లో దోమలు సమస్య ఎక్కువగా ఉండేది. అయితే కొన్ని రోజులుగా అన్ని ప్రాంతాల్లో, అన్ని సీజన్లలో దోమల బెడద ఎక్కువైందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోగాల బారిన ప్రజలు

దోమల సమస్యతో అనేక మంది వివిధ రోగాల బారిన పడుతున్నారు. మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడువాపు తదితర వ్యాధుల వ్యాప్తి గ్రామాల్లో అధికంగా ఉంది. పలు ప్రాంతాల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా మురుగు నిలిచిపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. అంతే కాకుండా గ్రామాల్లో ఎక్కడా కాలువల సదుపాయం సరిగ్గా లేకపోవడం వలన జననివాసాల మధ్య వాడుక నీరు, వర్షపు నీరు నిల్వ అవుతున్నాయి. ఫలితంగా దోమలు మరింత ఉధృతంగా పెరిగిపోతున్నాయి. ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఎక్కువ గ్రామాలకు కాలువల సమస్య ఉండడం వలన దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

నివారణ చర్యలు శూన్యం

గ్రామ పంచాయతీల ద్వారా డ్రెయిన్లు, మురికి ప్రాంతాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయకపోవడం కూడా వీటి వృద్ధికి కారణమవుతోంది. గ్రామాల్లో దోమల నివారణకు గతంలో పంచాయతీలకు ఫాగింగ్ మెషీన్లు సరఫరా చేశారు. కానీ వాటిని ఉపయోగిస్తున్నట్లు ఎక్కడా కనిపించడం లేదు. దీనిపై ఆరా తీస్తే పంచాయతీల్లో తగినంత పారిశుద్ధ్య సిబ్బంది లేకపోవడం వలన మందు పిచికారీ చేయడం లేదని, ఫాగింగ్ మెషిన్లు వినియోగించడం లేదని తెలుస్తోంది. ఇంతకు ముందెన్నడూ లేనివిధంగా దోమ కుట్టిన వెంటనే చర్మంపై మంట, దద్దుర్లు వస్తున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దోమల నివారణకు అధిక సొమ్ములు వెచ్చించి మస్కిటో కాయిల్స్ వెలిగిస్తున్నా, లిక్విడ్ మెషిన్లు పెడుతున్నా వాటి బారినుంచి తప్పించుకోలేకపోతున్నామని వాపోతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం

గ్రామాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. దోమల నివారణకు అవసరమైన చోట ఫాగింగ్ చేయించాలని పంచాయతీ కార్యదర్శులకు చెప్పడం జరుగుతుంది. గ్రామాల్లో క్షేత్రస్థాయి పరిశీలన జరిపి దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం.

– పి.వెంకటరాజు, ఎంపీడీవో, లావేరు మండలం

ప్రత్యేక చర్యలు చేపట్టాలి



ప్రస్తుతం విపరీతంగా పెరిగిపోయిన దోమల నివారణకు ప్రభుత్వం గ్రామ పంచాయతీల ద్వారా ప్రత్యేక చర్యలు చేపట్టాలి. ప్రధానంగా డ్రైనేజీల్లో ఎబేట్ మందు పిచికారీ కార్యక్రమాన్ని తరచూ విస్తృతంగా చేపట్టి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– ఎస్.శ్రీనివాసరావు, కొంగరాం

జ్వరం వస్తే వైద్యులను సంప్రదించాలి



దోమే కదా కుట్టిందని ఊరుకుంటే ఒక్కోసారి ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. పలు రకాల దోమలు కుట్టడం వల్ల తొలుత జ్వరం వస్తుంది. నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి. అవసరమైతే పరీక్షలు చేయించుకుని తగని వైద్యం పొందాలి.

– శేషగిరి, ప్రాథమిక వైద్యశాల వైద్యుడు, పొన్నాడ

ఉత్సాహంగా జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో జిల్లా హ్యాండ్‌బాల్ సంఘ ప్రతినిధులు, సెలెక్టర్లు


హ్యాండ్‌బాల్ ఎంపికల్లో క్రీడాకారుల జోరు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి సీనియర్స్ పురుషుల హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికలు ఆద్యాంతం ఉత్సాహభరితంగా సాగాయి. శ్రీకాకుళం జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియం మైదానంలో జరిగిన ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను నిరూపించుకున్నారు. ఇక్కడ ఎలాగైనా రాణించి రాష్ట్ర పోటీలకు ఎంపిక కావాలనే లక్ష్యంతో క్రీడాకారులు రెట్టించిన ఉత్సాహంతో పోటీల్లో పాల్గొన్నారు. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుంకరి కృష్ణకుమార్, ఎమ్మెస్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సెలక్షన్ కమిటీ చైర్మన్ రవిశేఖర్ నేతృత్వంలో కార్యనిర్వాహక కార్యదర్శి డి.ఈశ్వరరావు, కోచ్ ఎల్.రాజశేఖర్ తదితరులు ఎంపికలను నిర్వహించారు. ఇక్కడ ఎంపికైన జట్టును ఈనెల 13 నుంచి అనంతపురంలో జరిగే ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ పురుషుల హ్యాండ్‌బాల్ టోర్నీకి పంపిస్తామని చంద్రశేఖర్ తెలియజేశారు. ఎంపికైన క్రీడాకారులు 12వ తేదీన ఉదయం 6.30 గంటలకు తమ లగేజీతోపాటు అవసరమైన ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు, పాస్ ఫోటోలతో చేరుకోవాలని సూచించారు.

నవంబర్ జీతాలు ఇవ్వకపోవడం దారుణం


మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పారిశుద్ధ్య కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కార్మికుల ఖాతాల్లో నవంబర్ నెల జీతాలు జమచేయకపోవడం దారుణమని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) అనుబంధ సంఘం గౌరవ అధ్యక్షుడు టి.తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కల్యాణి అప్పలరాజులు అన్నారు. రాష్ట్ర సమితి పిలుపు మేరకు శ్రీకాకుళం మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న అన్ని నగర పంచాయతీలు, మున్సిపాలిటీలు, నగర కార్పొరేషన్ కార్యాలయాల దగ్గర నిరసనలు చేపడుతున్నామన్నారు. మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికుల జీతాల పెంపునకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అంగీకరించిన మినిట్స్‌ను అమలు చేయాలని కోరారు. మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారాంతపు సెలవు, పండగ సెలవులు అమలు చేయాలన్నారు. విలీన పంచాయతీ కార్మికులకు డివిజన్ ఏర్పాటు చేయాలని, లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ముఖ్య సలహాదారు ఎస్.బాబురావు, మున్సిపల్ ఇంజినీరింగ్ యూనియన్ నాయకులు శ్యామలరావు, కిషోర్, సతీష్, ముకేష్, మాధురి, అరుణ, జయశ్రీ, మున్సిపల్ శానిటరీ మేస్త్రీల సంఘం అధ్యక్షుడు ముద్దాడ రామారావు, షణ్ముఖరావు, మున్సిపల్ నాయకులు జె.గురుమూర్తి, ఎస్.పార్థసారథి, ఆర్.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రజతోత్సవ వేడుకలు


సమాఖ్య సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య నెలవారీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 25 ఏళ్ల రజతోత్సవ వేడుకలు సోమవారంతో ముగిశాయి. స్థానిక బాపూజీ కళామందిర్‌లో ప్రముఖ హరికథా కళాకారుడు బుసకల రంగారావు భాగవతార్‌చే 'సీతా కల్యాణం' కథ ప్రదర్శన జరిగింది. అలాగే సనపల ధనుంజయ బృందంచే అల్లూరి సీతారామరాజు బుర్రకథ ప్రదర్శన చేపట్టారు. అనంతరం ప్రముఖ జాతీయ స్థాయి మిమిక్రి కళాకారుడు లోకనాథం నందికేశ్వరరావుచే మిమిక్రీ ప్రదర్శన సాగింది. అనంతరం రంగస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు చిట్టి వేంకటరావు ఆధ్వర్యంలో జరిగిన సభలో ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. త్వరలో రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండుగగా గుర్తించనున్నట్లు తెలిపారు. పలువురు వక్తలు మాట్లాడుతూ కళాసేవ ఎంతో గొప్పదన్నారు. ఈ సందర్భంగా రంగస్థల కళాకారులకు ఆర్థిక సాయం అందిస్తున్న దాతలు, కళాకారుల సమాఖ్య సభ్యులను ఘనంగా సత్కరించారు. అలాగే గరికయ్య మాస్టారు జ్ఞాపకార్థం పేద కళాకారులకు నూతన వస్త్రాల బహుకరణ జరిగింది. కార్యక్రమంలో నల్లి ధర్మారావు, ఇప్పిలి శంకర శర్మ, సురంగి మోహనరావు, పీఎంజే బాబు, మదారపు వెంకటేష్, తేజేశ్వరరావు, సమాఖ్య సభ్యులు పన్నాల నర్సింహమూర్తి, ఎల్.రామలింగస్వామి, బి.రామచంద్రదేవ్, కలగ గణేష్ యాదవ్, నిక్కు హరిసత్యనారాయణ, పొట్నూరు వెంకటరావు, మంతిన వాసుదేవాచారి, కంచరాన అప్పారావు, ఇంజరాపు రమణారావు, ఎ.సింహాచలం తదితరులు పాల్గొన్నారు

13న జిల్లా బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి సీనియర్స్ బాక్సింగ్ క్రీడాకారుల ఎంపికలను ఈనెల 13వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి బలగ అనంత లక్ష్మణ్‌దేవ్(అను) సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం భవనంలో ఆరోజు ఉదయం 6 గంటల నుంచి మొదలవుతాయని చెప్పారు. 1984 జనవరి ఒకటి నుంచి 2005 డిసెంబర్ 31 మధ్యలో జన్మించినవారు అర్హులని పేర్కొన్నారు. క్రీడాకారులకు వేయింగ్ 47-50 కేజీల నుంచి 50-55, 55-60, 60-65, 65-70, 70-75, 75-80, 80-85, 85-90, 90 ప్లస్ కేజీల కేటగిరిల్లో పోటీలు జరుగుతాయని చెప్పారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, 3 పాస్‌ఫొటోలతో ఎంపికల్లో పాల్గొనాలని సూచించారు. మరిన్ని వివరాలకు 89774 96979 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలేంకు చెందిన ఒక విద్యార్థిని అదృశ్యమైనట్లు తల్లి సోమవారం ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎచ్చెర్లలోని ఒక డిగ్రీ కళాశాలలో విద్యార్థిని చదువుతోంది.

క్రీడల్లో రాణించాలి


పతకాలు సాధించిన క్రీడాకారులతో ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో రాణించి జిల్లా ఖ్యాతిని చాటి చెప్పాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. వెయిట్ లిఫ్టింగ్ స్పోర్ట్స్ మీట్‌లలో పతకాలు సాధించిన క్రీడాకారులను సోమవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. కార్యక్రమంలో డీఎస్ఏ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ ఇప్పిలి అప్పన్న, జి.హిమగిరి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే సదస్సులు

గార: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ ఎస్.రమణారావు అన్నారు. సోమవారం శ్రీకూర్మం సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో జరిగిన పొరపాట్లు, వన్‌బీ, అడంగల్ సమస్యలు వంటివాటిపై దరఖాస్తులు చేసుకోవాలన్నారు. నెల రోజుల్లోగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ఆదేశించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేత


కృష్ణాపార్కు వద్ద గుంతలను పూడ్చిన అనంతరం రోడ్డు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఈనెల 2వ తేదీన 'నగరంలో అడుగడుగునా గుంతలు' అనే శీర్షికతో సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దీనిలో భాగంగా గోతులమయంగా ఉన్న అరసవల్లి రోడ్డు, కృష్ణాపార్కు రోడ్డు, డే అండ్ నైట్ రోడ్డు, పాలకొండ రోడ్డులతో పాటు పలుచోట్ల గుంతలు పూడ్చారు. దీంతో అటువైపుగా వెళ్తున్న ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

లారీ తొలగింపు

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారిపై కొయ్యరాళ్ల కూడలి సమీపంలో విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీకొనడంతో డ్రైవర్ మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఆ లారీలోని కొబ్బరికాయలను వేరే లారీలో లోడింగ్ చేసి సోమవారం తరలించారు. అనంతరం విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీని తొలగించారు. జాతీయ రహదారులు సంస్థ, విద్యుత్, పోలీస్ శాఖ అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. 33 కేవీ విద్యుత్ స్తంభం మూడు రోజుల్లో ఏర్పాటు చేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు చెప్పారు.

దుస్తుల వితరణ



శ్రీకాకుళం పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న బెహరా మనోవికాస కేంద్రంలో ది న్యూ ఫ్రెండ్స్ ఆఫ్ ఎర్త్ వాలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో దుస్తుల వితరణ కార్యక్రమం సోమవారం జరిగింది. సీనియర్ ఫిజియోథెరపిస్టు డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్ వివాహ వార్షికోత్సవం పురస్కరించుకొని దుస్తులు, కేకులు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రమా శ్రీనివాస్ పట్నాయక్, డాక్టర్ కరకవలస వినీల భాయి పట్నాయక్, పోలు మహంతి ఉమామహేశ్వరరావు, కరుణాకర్ భాస్కర్, శ్యామల కుమారి, పొన్నాడ రుషీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

తొలగించేదెన్నడో..!



జాతీయ రహదారిపై కింతలి మిల్లు సమీపంలో యంత్రాలతో రోడ్డు ఇటీవల శుభ్రం చేశారు. అయితే అనంతరం చెత్తను రోడ్డుకి ఒకవైపు ఉంచేశారు. పది రోజులు గడుస్తున్నా ఇంకా ఈ చెత్త పోగుల తొలగింపు చర్యలు తీసుకోలేదు. దీంతో మళ్లీ రోడ్డు మీదకు ఈ చెత్త వస్తోంది. ఫలితంగా వాహన చోదకులు సైతం ఇబ్బంది పడుతున్నారు. చెత్త పోగులు తొలగించాలని కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

పశువులు పట్టివేత



లావేరు మండలంలోని బొంతుపేట కేకే గ్రానైట్స్ పరిశ్రమ ఎదురుగా జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న పశువులను లావేరు ఎస్ఐ జి.లక్ష్మణరావు సోమవారం పట్టుకున్నారు. బుడుమూరు సంత నుంచి రణస్థలం వైపు వెళ్తున్న బొలెరో వ్యానులో ఈ పశువులను తరలిస్తుండగా పట్టుకోవడం జరిగిందని తెలిపారు. ఇందులో ఏడు ఆవులు, ఒక దూడ ఉన్నట్లు తెలిపారు. దీంతో వ్యాన్ డ్రైవర్ పుణ్యపు గురునాథ్‌పై కేసు నమోదు చేశారు.

– ఎచ్చెర్ల

అప్రెంటిస్ మేళాలో 38 మంది ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ)లో అప్రెంటిస్ మేళా సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్‌రావు పర్యవేక్షించారు. 47 ఖాళీల కోసం మేళా నిర్వహించగా, 112 మంది హాజరయ్యారు. వీరిలో 38 మందిని ఎంపిక చేశారు. స్థానికంగా ఉన్న ఏడు పరిశ్రమలు ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు , విద్యార్హతలు పరిశీలించి అప్రెంటిస్‌కు ఎంపిక చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఐటీఐ పూర్తిచేసుకున్న వారు అప్రెంటీస్ పరిశ్రమల్లో చేరాలని, అనంతరం ఉద్యోగాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో ఐఎంసీ చైర్మన్ ఎంవీఆర్ మూర్తి, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ జేఆర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్యాస్ బిల్లులు విడుదల చేయాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాలకు అందజేస్తున్న వంట గ్యాస్ బిల్లులు తక్షణమే విడుదల హెచ్‌పీ గ్యాస్ వేదమాత ఏజెన్సీస్ యజమాని దుప్పల రవీంద్రబాబు కోరారు. ఈ మేరకు మీకోసంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. తాము పెద్దపాడు, ఎచ్చెర్ల, దుప్పలవలస గురుకులాలకు గ్యాస్ సరఫరా చేస్తున్నామని, జూన్ నుంచి బకాయిలు ఉన్నాయన్నారు. వాటిని తనకు ఇప్పించాలని కోరారు. ఆరు నెలలుగా బకాయిలు ఉన్నందున ఆర్థిక భారం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చెందారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. శ్రీఆచార్య ప్రబోనంద యోగీశ్వరులు రచించినటువంటి త్రైత సిద్ధాంత అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలను విద్యార్థులకు, యువతకు, గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు దుర్గారావు, వెంకటరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

పరామర్శ


వెంకట అప్పారావును పరామర్శిస్తున్న నాయకులు

జి.సిగడాం: మండలంలోని పాలఖండ్యాం గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ధారబోయిన వెంకట అప్పారావు తల్లి నారాయణమ్మ ఇటీవల మృతి చెందింది. దీంతో వారి కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, బూత్ కన్వీనర్ అబోతుల జగన్నాథం, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ కోరాయి అప్పారావు, చిక్కాల శ్రీనివాసరావులు సోమవారం పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు ధారబోయిన ధర్మరాజ్, రెయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎస్ఐ సందీప్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్‌కుమార్ సూచించారు. మండలంలోని ముద్దాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం సంకల్పం కార్యక్రమం నిర్వహించి, మాదక ద్రవ్యాలు, మహిళ రక్షణ చట్టాలపై మాట్లాడారు. ప్రస్తుతం ఉత్తమ మానవ వనరులుగా మారాల్సిన యువత చెడుమార్గంలో ప్రయాణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నేరాల్లో ఇరుక్కొని విలువైన జీవితం కోల్పోవద్దన్నారు.

వర్మీ కంపోస్టు అమ్మకాలు పరిశీలన

శ్రీకాకుళం పాతబస్టాండ్: బూర్జ మండలంలోని బూర్జ గ్రామం సచివాలయం పరిధిలో పంచాయతీ వారు తయారు చేసిన వర్మీ కంపోస్టు ఎరువులను జెడ్పీ కార్యాలయం వద్ద సోమవారం అమ్మకాలు చేపట్టారు. ఆ పంచాయతీ ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేశారు. అమ్మకాలను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు.